

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



### "మూడు టీవీలూ-ఆరు పత్రికలూ-అరవై ప్రాణగండాలూ"

10

**క్రిందటి నెల అక్టోబర్,** 2011**లో ఇండియా వెళ్ళి** మూడు వారాలు హైదరాబాద్, కాకినాడ, తిరుపతి వెళ్ళి వచ్చాను. నేను హైదరాబాదు వచ్చినట్టు ఎలా తెలిసిందో తెలియదు కానీ, రెండో రోజునే సాక్షి టీవీ తాలూకు ఒకాయన నన్ను ఈ-మెయిలూ మరియూ ఫోన్‌లోనూ పట్టుకుని, వారి "వేదిక" కార్యక్రమంలో పాల్గొనమని ఆహ్వానించారు. "అమ్మయ్య, మళ్ళీ టీవీలో కనపడే అవకాశం వచ్చింది కదా" అని ఎవరికీ కనపడకుండా కాలర్ ఎగరేసుకుని, పైకి మటుకు అబ్బే, అంత టైము లేదూ, అయినా నేను ఎందుకూ అని ఆయనతో ఏదో మాటవరసకి అనగానే, "అలా అయితే సరే లెండి" అని ఆయన ఫోన్ పెట్టెయ్యబోయాడు. నేను వేంఠనే, నాలుగు దగ్గులు దగ్గి, ఇండియాలో అడుగుపెట్టగానే ఎన్నారైలందరినీ ఆవహించే రోగాల వేపు టాపిక్ మార్చేసి, రెండు, మూడు నిముషాలలో మళ్ళీ నా టీవీ ప్రోగ్రాం గురించి అతి లాఘవంగా ఆయనతో మాట్లాడి, ఆయన చెప్పిన టైముకి సాక్షి టీవీ స్టూడియోకి వెళ్ళడానికి ఒప్పేసుకున్నాను. ఆయన కూడా కడు సంతసించి, తానే స్వయంగా ఆ మర్నాడు నన్ను స్టూడియోకి తీసుకెళ్ళాడు. ఈ కార్యక్రమం టీవీ నైన్ లో బాగా ప్రాచుర్యం పొందిన "వారధి" కార్యక్రమంలాగా ఎన్నారైలు ఫోన్ చేసి ఆ అతిథితో మాట్లాడే కార్యక్రమం అన్నమాట. సాక్షి వారి ఈ కార్యక్రమం పేరు "ఎన్నారై వేదిక". ఆ వేదికలో ఇప్పటివరకూ రాజకీయవేత్తలూ, సినిమా వాళ్ళూ పాల్గొన్నా, సాహిత్యం టైపులో మొట్టమొదటి అతిథి నేనే అని ఆయన వివరించారు. అది వినగానే తెలుగు సాహిత్యానికి, సాక్షి టీవీకి పడిన గతికి వారి మీదా, నా మీద నాకే జాలి వేసింది.

ఆ సాక్షి భవనంలో అడుగుపెట్టగానే, ఎదురుగుండా అన్ని గోడల మీదా స్వర్గీయ వైయస్సార్ గారు తలపాగా చుట్టుకుని నన్ను ఆహ్వానిస్తున్న ఫోటోలు చూసి సంతోషించినా, పొరపాటున నన్ను కూడా ఆయన మేఘాలలోకి రమ్మంటున్నారేమో అని అనుమానం వేసి, ఆ ఫోటోల కేసి చూడ్డం మానేసాను. ఇక్కడ నేను గమనించినదేమిటంటే, హైదరాబాద్‌లో రోడ్డు మీద అడుగుపెట్టగానే కోట్ల కొద్దీ జనం, రైల్ రోకోలు, సకల జనుల సమ్మెలూ, రోడ్డు మీద వంటలూ, సినిమా హీరోలూ, దౌర్భాగ్య రాజకీయ వినాయకుల కట్-ఔట్‌లు, చెవులు బద్దలయ్యేలా కారు హారన్‌ల ఘోష మొదలైన వాటితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్సి వస్తే, ఈ సాక్షి టీవీ మరియు పత్రికా భవనం అత్యాధునికంగా తళ తళ లాడుతూ, కళ కళ లాడుతూ, లోపల ఎక్కడా ఒక్క మనిషి కూడా కనపడకుండా ఎంతో

నిశ్శబ్దంగా ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని ఉండాలి. అనగా, పళ్ళూడగొట్టుకోడానికి ఏ రాయి అయితేనేం అన్నట్టు, హైదరాబాద్‌లో ఎక్కడయినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్సిందే!

నన్ను కూడా తీసుకొచ్చిన ఆ టీవీ ప్రొడ్యూసర్‌గారు, ఆ భవనంలో అటూ, ఇటూ తిప్పి ఒక గదిలో కూచోబెట్టి, చాయ్ ఆర్డరు చేసి నాతో ముచ్చట్లు ఆడుతూండగా, సున్నితంగా తపులు తీసుకుని ఒక వెలుగు లోపలికి వచ్చింది. ఆ అందమైన అమ్మాయి లోపల అడుగుపెట్టగానే, అప్పటి వరకూ టీవీ షో చేస్తున్నాన్నోచ్ అనే గర్వంతో  నా తలకాయ వెనకాల గిర గిరా తిరుగుతున్న విష్ణు చక్రం వెల వెల బోయింది. ఎందుకంటే ఆ అమ్మాయే నన్ను ఇంటర్వ్యూ చెయ్యబోయే ఏంకరమ్మాయిట. పైగా పేరు కూడా "తరంగిణి" అనే చాలా సొంపయిన పేరు.

ఆ పిల్ల వాలకాన్నీ, చిరునవ్వునీ చూస్తూ ఆ యాంకర్ పక్కన నన్ను ఊహించుకోగానే ఎందుకో మా క్వీన్ విక్టోరియా గుర్తుకొచ్చి భయం వేసింది. వెంటనే, ఆ ప్రొడ్యూసర్ గారిని

"అయ్యా, ఈ ఏంకర్ బదులు నాలాగా ఉండే మరొక మగ యాంకరుణ్నో, లేదా, ఆ అమ్మాయిలాగా ఉండే మరొక సాహిత్యం గెస్టునో పెట్టుకుంటే బావుంటుంద"ని సూచించాను.

ఆయన నవ్వి పారేసి, "ఆవిడతో నేను మాట్లాడతాను లెండి, ఈ సారికిలా కానివ్వండి" అని భరోసా ఇచ్చాడు.

ఇక్కడ ఆయన ఆవిడ అంటే మా ఆవిడ అని నాకు తెలిసిపోయింది. ఎందుకంటే అంతకు ముందే ఆయన నా కథలు చదివినట్టూ, అందులో క్వీన్ విక్టోరియా పాత్ర మీదా మాట్లాడాడు. ఇవాళ ఈ అవకాశం రావడానికి కూడా ఆవిడే కారణం అని కూడా చెప్పినట్టు గుర్తు. ప్రొడ్యూసర్ గారికీ నాకూ మధ్య జరుగుతున్న రహస్య సంభాషణని వింటూ తరంగిణి తెరలు, తెరలుగా నవ్వుతూ, చేతిలో ఉన్న నాలుగు కాగితాలూ తిరగేస్తూ నన్ను పలకరించి, నా జీవిత విశేషాలు కొన్ని చెక్ చేసుకుంది. ఇక్కడ నాకు ఆశ్చర్యం ఏమిటంటే, ఎక్కడో నా కంప్యూటర్‌లో మారుమూల దాక్కుని ఉన్న నా బయోడేటా ఆ పిల్ల చేతిలోకి ఎలా వచ్చిందో నాకు తెలియదు. అప్పటికే ఆ అమ్మాయి అవి చదివేసి, నా గురించి ప్రిపేర్ అయిపోయి, నన్ను అడగబోయే ప్రశ్నలు సిద్ధం చేసుకుని, ఏదో మాట వరసకి ఇంటర్వ్యూ ముందు నన్ను పలకరించడానికి వచ్చిందనమాట.

ఏమైతేనేం, ఇద్దరం త్వరలోనే స్నేహితులం అయిపోయి, పెద్ద పెద్ద భారీ లైట్లు, రెండు కుర్చీలూ ఉన్న స్టూడియోలో అడుగుపెట్టాం. అప్పటికే, ఇద్దరు కెమేరే వాళ్ళూ, సౌండు వాళ్ళు అక్కడ సిద్ధంగా ఉన్నారు. నేనొక్కడినే అక్కడ బలి పశువుని అని తెలిసిపోయింది. పైగా, తరంగిణికి మాత్రమే  కనపడేటట్టుగా ఎదురుగా ఒక టెలిప్రాంప్టరులో ఆ అమ్మాయి చెప్పవలసిన ముందు మాటలూ, నన్ను అడగవలసిన ప్రశ్నలూ వరసగా వస్తున్నాయి. అవి చదివి ఆ అమ్మాయి ప్రాక్టీసు చేసుకుంటోంది కానీ, నాకు మటుకు, టెలీ ప్రాంప్టరూ లేదు, గాడిద గుడ్డూ లేదు. పైగా ఎదురుగా అరివీర భయంకరంగా నాకేసి చూస్తూ వేళ్ళతో అటు జరుగు, ఇటు జరుగు, కుర్చీలో అలా హడిలి చస్తూ కూచోకు, కళ్ళు చిట్లించకు, చిట్లించిన యడల గుడ్డి  వెధవలా కనపడుదువు, ఈ ఫ్లడ్ లైట్లలో కెమేరా కేసి చూడ్డం అలవాటు చేసుకో, అలా గుడ్లప్పగించి తరంగిణి కేసి చూస్తే, ఆ అమ్మాయి మొగుడు కోప్పడతాడు అని నన్ను పరి పరి విధాలుగా హెచ్చరిస్తూ ఒక మీసాల వాడు ఓవర్ ఏక్షన్ చేస్తున్నాడు. తరంగిణికి అతనేమన్నా బాడీగార్డా అని అనుమానం వచ్చేసినా నేను నోరు మెదిపే పరిస్తితి లేదు కదా! మొత్తానికి, సుమారు గంటన్నర సేపు ఆ అమ్మాయి నన్ను మంచి తెలుగులో మంచి ప్రశ్నలు అడగడం నాకు ముచ్చటేసింది. అలాగే ఐదారు దేశాలనుంచి శ్రోతలు కూడా మంచి ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమం అంతా అర్ధరాత్రి పన్నెండు గంటలనుంచి ఒంటి గంట వరకూ లైవ్ ప్రోగ్రాం కాబట్టి నిద్రపోకుండా నిరంతర చాయ్ సరఫరా జరుగుతూనే ఉంది. నన్నూ, తరంగిణినీ చూస్తూ నా సుత్తి వినదల్చున్న వారు, ఈ క్రింది లింక్ లో చూడవచ్చును.

http://www.sakshitv.com/index.php?option=com_content&view=article&id=14607:2011-10-22-03-00-58&catid=149:netnews&Itemid=763

ఈ తరంగిణీ తతంగం జరిగిన రెండు రోజులకి జెమిని టీవీ వారు, ఆ మర్నాడు జీ తెలుగు మరియు సిటీ కేబుల్ టీవీ వారు పిలిచి వారి స్టూడియోలకి ఆహ్వానించారు.

కార్యక్రమ సారాంశం ఒకటే కానీ, పద్ధతులు కొంచెం తేడా. ఉదాహరణకి, జెమిని వారి కార్యక్రమం పేరు "గెస్ట్ అవర్". జీ తెలుగు వారి ప్రోగ్రాం పేరు "కాఫీ టైం".

సాక్షి టీవీలో లాగా తరంగిణి లాంటి అమ్మాయి యాంకరుగా ఉంటుంది కదా అని మరి కాస్త పౌడర్రూ, సెంటూ రాసుకుని స్టైలిష్ నడక ప్రాక్టీస్ చేసుకుని జెమిని టీవీ స్టూడియోలోకి అడుగుపెట్టాను. ఇక్కడ అంతా హడావుడిగా ఉంది. నేను భయం, భయంగా చుట్టూ చూస్తూ ఉండగా ఒకాయన వచ్చి నన్ను పలకరించి తన ఆఫీసులోకి తీసుకెళ్ళి చాయ్ ఆర్డరు చేసి నాతో ముచ్చట్లాడుతూండగా ఠపీమని తలుపు తెరుచుకుని ఒక యువకుడు లోపలికి ప్రవేశించాడు.

"ఈయనే సార్ మీ యాంకర్" అని అతన్ని ప్రొడ్యూసర్ గారు నాకు పరిచయం చేశారు.

"నేను కూడా మంచి యేక్టర్‌ని సార్" అని ఆ యువకుడు నాకు నమస్కారం పెట్టగానే, జెమినిలో కూడా టీవీ షో చేస్తున్నానోచ్ అని సగర్వంతో నా తల వెనకాల తిరుగుతున్నా విష్ణుచక్రం ఈ సారి వెల వెల పోలేదు సరికదా, మరింత జోరుగా తిరిగింది.

అందమైన అమ్మాయి యాంకర్ అయిన యడల కలుగు మనోభావములకూ, మేకప్ చేసుకున్న మగబ్బాయి యాంకర్ అయిన యడల కలుగు మనోభావములకూ చాలా తేడా ఉండునని నాకు అప్పుడు తెలిసిపోయింది. ఈ అబ్బాయికి నా గురించి పూర్తిగా తెలియక పోయినా, పాపం ఎలాంటి ప్రశ్నలు నన్ను అడిగితే బావుంటుందీ అని చిన్న సైజు మేచ్ ఫిక్సింగ్ చేసుకున్నాడు.

ముందుగా అతను "సార్, మీరు యుయస్‌లో అన్నేళ్ళు ఉంటూ, ఎప్పుడు బిజీగా ఉండే మీ లైఫ్‌లో లిటరేచర్‌కి టైం ఎక్కడ దొరుకుతుంది, స్టోరీస్ రాయడం చాలా డిఫికల్ట్ కదా, మా లిజనర్స్‌కి డిటైల్డ్‌గా ఎక్స్‌ప్లెయిన్ చెయ్యగలరా" అనే ప్రశ్నతో మొదలుపెట్టాడు. ఏ ప్రశ్న అడిగినా, ఏ సంకర భాషలో అడిగినా నేను చెప్పదల్చుకున్న విషయాన్నే తెలుగులో నొక్కివక్కాణించే పోలిసీ అప్పుడప్పుడు నేను పాటిస్తాను. అంచేత ఆ యాంకర్ కుర్రాడు ఏ ప్రశ్న అడిగినా, నేను కొట్టదల్చుకున్న సుత్తిలో మార్పు ఉండదు. ఆ విధంగా జెమిని వారి ఇంటర్‌వ్యూ కూడా పూర్తిచేశాను. అది జెమినీ వారి కార్యక్రమం అక్టోబర్ 29, 2011 నాడు ప్రసారం అయిందిట.

ఇక జీ తెలుగు మరియు సిటీ టెలివిజన్ తాలూకు ప్రొడ్యూసర్‌గారు నాకు ఇదివరలో తెలిసినాయనే. ఆయన దర్శకత్వంలోనే నేను ఇది వరకు ఒక టీవీ సీరియల్‌లో నటించాను. మొన్న నేను స్టూడియోలోకి వెళ్ళగానే, ముందుగా నన్ను మేకప్ గదిలోకి తీసుకెళ్ళి మొహం కడిగి, దట్టంగా పౌడరు రాసి, కనుబొమ్మలు గీకి అలనాటి ఎన్‌టీఆర్‌లాగా భారీ మేకప్ చేశారు. నన్ను టీవీలో బాగా కనపడడానికి ఈ ప్రొడ్యూసర్‌గారు పడిన తంటాలు చూస్తే ఆయనకి నా సహజ ముఖారవిందం మీద ఉన్న అభిప్రాయం నాకు స్పష్టంగానే తెలిసింది. అదే సమయంలో మరొక అందమైన అమ్మాయి కూడా రంగులు వేసుకుంటూ, వగలుపోతూ ఉంటే, నేను చూసిన చూపులకి ఆ అమ్మాయి స్పందించి "నేనే మీ యాంకరమ్మాయిని సార్, నా పేరు అనూష" అని పరిచయం చేసుకుంది.

యధాప్రకారం ప్రొడ్యూసర్ గారితో, "ఇంత చక్కటి పిల్ల యాంకరయితే, మన మొహం ఎవరు చూస్తారు సార్" అన్నాను.

"అందుకే కదా మీకు కూడా మేకప్ చేయించాము" అనే డేమేజింగ్ జోకు నా మీదా "ఇక్కడెక్కడా చక్కటి పిల్లలు లేరే" అని ఆ అమ్మాయి మీదా చమత్కరించారు ప్రొడ్యూసర్ గారు. ఈ అనూష అనే అమ్మాయికి నా గురించి అస్సలు ఏమీ తెలియదు. అందు చేత నేను యధాప్రకారం ఆ అమ్మాయి నన్ను ఏమి అడిగినా, నేను చెప్పదల్చుకున్న సమాధానాలే చెప్పి ఇంటర్‌వ్యూ పూర్తి చేశాను.

మొత్తానికి ఈ మూడు టీవీ ఇంటర్‌వ్యూలూ, ఆరు పత్రికల వారి ఇంటర్‌వ్యూల సారాంశం అంతా నాకు తెలిసిన ఒకే ఒక

సబ్జెక్టు....అంటే నా గురించి నేనే చెప్పుకోవడం. ఇతరుల గురించి ఎక్కువ చెప్పకపోవడం. సొంత డబ్బా కొట్టుకోవడంలో ఉన్న మహదానందం పై వాళ్ళ డబ్బా కొడితే ఉంటుందా మరి!

పనిలో పనిగా, ఈ సారి ఇండియా ట్రిప్‌లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి 17 వ వార్షికోత్సవాలు అక్టోబర్ 23, 2011న చాలా వైభవంగా నిర్వహించాం. అందులో భాగంగా, ఇప్పటి వరకూ కేంద్ర సాహిత్య అకాడెమీ వారి పురస్కార గ్రహీతలైన తెలుగు రచయితలందరినీ ఒకే వేదిక మీద సత్కరించాం. మాలతీ చందూర్, సి. నారాయణ రెడ్డి, కాళీపట్నం రామారావు, ఎన్. గోపి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రావూరు భరద్వాజ, కేతు విశ్వనాథ రెడ్డి, కె. శివారెడ్డి, మునిపల్లె రాజు, అబ్బూరి ఛాయా దేవి, చేకూరి రామారావు, అంపశయ్య నవీన్ మొదలైన 22 మంది సాహితీ దిగ్గజాలు మా చిరుసత్కారాన్ని అందుకున్నారు. ఈ వార్షికోత్సవాలలో మరొక భాగంగా, కౌముదిలో గత రెండు, మూడు సంవత్సరాలగా వెలువడిన నా "అమెరి"కాకమ్మ" కథలు" (32 కథలు) పుస్తక రూపేణా ప్రచురించి, డా. సి.నారాయణ రెడ్డి గారి చేతుల మీదుగా ఆవిష్కరించబడింది. గొల్లపూడి వారు, కవి జొన్నవిత్తుల వారు ప్రత్యేక అతిథులుగా ఆ కథల మీద ప్రసంగించారు. ఈ సభ దృశ్య మాలిక, వీడియో ఈ క్రింది లింకులలో చూడవచ్చును.

http://www.youtube.com/watch?v=lPu_uzGBbpY

ఈ సభలో జరిగిన మరొక విశేషం ఏమిటంటే, అంతకు ముందే కొద్ది రోజుల క్రితం జాతీయ స్థాయి ఉన్నత తెలుగు అధ్యయన కేంద్రం మైసూరులో ప్రారంభిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తెలుగు భాషకి ప్రాచీన భాష కలిగించిన నేపథ్యంలో ఆ అధ్యయన కేంద్రం హైదరాబాదులోనే నెలకొల్పాలని యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌గారు వివరాలు తెలిపారు. "తెలుగు అధ్యయన కేంద్రం హైదరాబాదులో ఏర్పరచాలని ఈ మహా సభ ఈ నాడు ఏకగ్రీవంగా తీర్మానించింది" అనే తీర్మానాన్ని డా. సి. నారాయణ రెడ్డి గారు ప్రతిపాదించగా సభా ప్రాంగణం కరతాళధ్వనుల మధ్య ఆ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ మర్నాడు, మైసూర్‌లో తెలుగు ఏర్పాటు చేసే ప్రసక్తి లేదని కేంద్రమంత్రి శ్రీమతి పురంధరీశ్వరీ దేవి ప్రకటించారని విన్నాను. ఈ విషయం పై నాకు పూర్తి అవగాహన లేక పోయినా, తెలుగు భాషా, సాహిత్యాల పరిరక్షణకి కృషి చేస్తున్న పెద్దలు ఈ వేదికని గుర్తించడం నాకు సంతోషాన్ని కలిగించిందనే చెప్పాలి.

మొత్తానికి మూడు వారాల పాటు హైదరాబాదులో ఇరవై రోజులు, కాకినాడలో వారం, తిరుపతిలో రెండు రోజులూ గడిపి, మళ్ళీ హ్యూస్టన్ వచ్చిపడ్డాను. అమెరికా జీవితం మళ్ళీ మొదలైంది. ముందు ఉంది ముసళ్ళ పండగ అనే సామెత నాకు వర్తిస్తుందో లేదో తెలియదు.

Click here to share your comments on this article